క్లుప్తంగా

కేజీబీవీని సందర్శించిన హైకోర్ట్ న్యాయవాది



రొద్దం కేజీబీవీని సందర్శించిన న్యాయవాది శివరామకృష్ణ బృందం

రొద్దం: స్థానిక కేజీబీవీని హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ బృందం గురువారం సందర్శించింది. పాఠశాలలో మౌలిక సదుపాయలపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, వంట గది, తాగు నీరు తదితర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. దాతల సహాయంతో పాఠశాలను అభివృద్ధి చేసిన ఎస్‌ఓ నాగరత్నమ్మను న్యాయవాది బృందం అభినందించింది.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



చిరంజీవిని పరామర్శిస్తున్న నాయకులు

మడకశిరరూరల్: తురుకువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చిరంజీవి పొలంలో కాలు జారిపడి కాలు దెబ్బతినడంతో చికిత్స చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, ఎస్సీ సెల్ నాయకుడు రంగనాథ్, వార్డు సభ్యుడు తిప్పన్న, నాయకులు రవికుమార్ తదితరులు ఇంటి వెళ్ళి చిరంజీవిని పరామర్శించారు. తర్వగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

దొమ్మరహట్టిలో కార్డెన్ సెర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు వీరాంజనేయులు, వీరేష్

రొళ్ల: దొమ్మరహట్టి గ్రామంలో గురువారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రొళ్ల, అగళి ఎస్‌ఐలు వీరాంజనేయులు, వీరేష్ సిబ్బందితో కలిసి గ్రామంలో అనుమానం ఉన్న చోట్ల తనిఖీ చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ క్రైమ్, మహిళలు, చిన్నారుల పట్ల జరిగే నేరాలు, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ ఇదాయితుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం నరేంద్రకు సన్మానం



హెచ్‌ఎం నరేంద్ర దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: గొడనహళ్ళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హెచ్‌ఎం పీవీ నరేంద్ర గురువారం ఉద్యోగ విరమణ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు హెఎం నరేంద్ర దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎం చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి రూ.74 వేలు ఇవ్వనున్నట్లు హెచ్‌ఎం ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గుడిబండ: కరికెర గ్రామ సమీపాన ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూప్ సంబంధించి 32 సీట్లు, సీనియర్ ఇంటర్‌లో 28 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఈనెల 2లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమాదేవి సూచించారు.

ఖోఖోలో సాసలకుంట జట్టు విజయం



షీల్డులు అందుకున్న క్రీడాకారులు

పావగడ: తాలూకాలోని సాసలకుంట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు హోబళి స్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించి తాలూకా స్థాయికి చేరుకున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం ఉత్కంఠ భరితంగా సాగిన ఖోఖో పోటీల్లో 5 జట్లతో పోటీ పడి సాసలకుంట జట్టు విజయకేతనం ఎగురవేసింది. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేక పోయినా గ్రామ ఖోఖో ఆటగాళ్ల మార్గ దర్శనంలో విజయం సాధించడం గర్వ కారణమని పాఠశాల హెచ్ ఎం బాలాజీ, భారత మాతా సేవా ట్రస్ట్ అధ్యక్షుడు నాగేంద్ర ప్రతాప్ హర్షం వ్యక్తం చేశారు.



పైకప్పు పెచ్చులూడిన దృశ్యం



గుడిబండలో శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రం

క్షణక్షణం.. భయం భయం

గుడిబండ: మడకశిర నియోజకవర్గంలోని పశువైద్య కేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరడంతో పశువైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రధానంగా గుడిబండలోని పశువైద్య కేంద్రం భవనం దెబ్బ తినడంతో వర్షపునీరు కారుతోంది. పైకప్పు పెచ్చులూడిపడుతున్నాయి. మరోవైపు ప్రహరీ దెబ్బతినడంతో పశువైద్యశాలకు రక్షణ కరువవుతోంది. గుడిబండ మండలం ఎస్ రాయాపురం, మడకశిర మండలం కల్లుమర్రి పశువైద్య కేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరడంతో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాతవాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



కల్లుమర్రి గ్రామంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల



భవనం శ్లాబ్ నుంచి నీరు లీకేజీ అవుతున్న దృశ్యం



దెబ్బతిన్న పశు వైద్యశాల ప్రహరీ

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోండి



రొళ్లలో మాట్లాడుతున్న ఏడీఏ శైలకుమారి

రొళ్ల: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా వనరుల కేంద్రం ఏడీ శైలకుమారి, స్థానిక వ్యవసాయశాఖ ఏఓ వెంకటబ్రహ్మం సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో రైతులకు జీవన ఎరువులు, మట్టి నమూనా తీసే పద్ధతితో పాటు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకొంటే ఖర్చులు తగ్గుతాయన్నారు. సేంద్రియ ఎరువులు ఒకసారి వేసుకొంటే రెండు, మూడు పంటల వరకు పంట దిగుబడి ఇస్తుందని తెలిపారు. వేరుశనగ సాగుతో పాటు ఇతరాత్ర పంటలు సాగు చేయడానికి ముందుగా నేలను లోతుగా దుక్కి ఉంచుకోవాలని సూచించారు. సాగుకు ముందు విత్తన శుద్ధి చేయడం ద్వారా వందశాతం విత్తనాలు మొలకెత్తడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం వేరుశనగ సాగు చేయని రైతులు కందులు, ఆముదం, అలసందతో పాటు కొర్రలు, మొక్కజొన్న, ఉలవలు, రాగి వంటి ఇతరాత్ర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు చంద్రకళ, హేమలత, ఎంపీఈఓలు శావిత్రమ్మ, దిల్‌షాద్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: రైతులు రాగి పంట విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ శైలకుమారి, ఏఓ తిమ్మప్ప కోరారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాయలంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాగి పంటను ప్రభుత్వమే క్వింటాల్ రూ.4900 చొప్పున కొనుగోలు చేస్తుందని తెలిపారు. విత్తన శుద్ధికి రైజోబియం, అసిటోబాక్టర్, పీఎస్‌బీ వంటి జీవన ఎరువులను వాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ కౌసర్, ఎంపీఈఓలు స్రవంతి, నాగలక్ష్మి, రవి, రైతులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుడికి పూజలు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

హిందూపురం: మండలంలోని బసవనపల్లి గ్రామంలో చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ గోపుర కలశస్థాపన గురువారం వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ చంద్రమౌళీశ్వర స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నవగ్రహాలకు పూజలు చేపట్టారు. మహిళలు కలశాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షణల అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ గోపురంపై కలశాన్ని ప్రతిష్టించారు. యోగినారాయణ సేవా సమితి భక్తబృందం ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలాపన జరిగింది. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాకులు, ఎంపీటీసీలు ధనంజయ రెడ్డి, కవిత, సర్పంచ్ భాగ్యమ్మ మూర్తి, ఏవీ రామిరెడ్డి, నారాయణరెడ్డి, బసప్ప పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఊరేగింపు



జ్యోతులతో తరలివెళ్తున్న భక్తులు

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి గ్రామంలో శ్రీరాముడి దేవాలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు గురువారం భక్తులు జ్యోతులు మోశారు. ప్రతి ఇంటి నుంచి జ్యోతులను వెలిగించుకుని భజన మందిరం వద్దకు చేరుకుని శ్రీరాముడి దేవాలయం వరకు ఊరేగించారు. అనంతరం ఫల పంచామృతభిషేకం, రామతారక హోమాలు, దేవతామూర్తుల మూల మంత్ర హోమం, ప్రతిష్టాపన హోమం, కళాహోమం, మూర్తి హోమం, మహాపూర్ణాహుతి, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట



ఊటుకూరులో ప్రాణ ప్రతిష్ట అనంతరం దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి మూల విరాట్



విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా జ్యోతులను మోస్తున్న మహిళలు

పరిగి: మండలంలోని ఊటుకూరులో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాలు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. మహిళలు జ్యోతులతో ఊరేగారు. కళశాలతో స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో పావగడ అభివృద్ధి



వేరుశనగ వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పావగడ పట్టణాభివృద్ధి కోసం రూ.20 కోట్లు కేటాయించారని, వాటితో మొత్తం 23 వార్డులలో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి సీఎం సిద్ధరామయ్య పావగడ కు రానున్నారని, ర్యాపిట గ్రామంలో 10 వేల ఎకరాల్లో నిర్మించే సోలార్ పార్క్‌ను జాతి కి అంకితం చేస్తారని తెలిపారు. పురాతన నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను త్వరలోనే చేపట్టి అద్భుతంగా నిర్మిస్తామన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, మాజీ అధ్యక్షుడు రాజేశ్, ప్రథమ శ్రేణి కాంట్రాక్టర్ ఏ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బస్టాండులో పర్యటించిన ఆయన వేరుశనగ వ్యాపారస్థురాలితో ముచ్చటించారు.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

గుడిబండ: మండలంలోని ముతుకూరు, తాళికెర గ్రామంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. ముతుకూరు గ్రామంలో ఉదయం 11 గంటలకు, తాళికెర గ్రామంలో మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అభియానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాలికల కమిటీ ఏర్పాటు



ఏఐఎస్‌ఏ బాలికల కమిటీని ఎంపిక చేస్తున్న జిల్లా అధ్యక్షుడు శివకుమార్

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్‌ఏ ఆధ్వర్యంలో బాలికల కమిటీని గురువారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆపడానికి, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో విద్యార్థినులు పడుతున్న సమస్యలను పరిష్కరించడానికి ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘం ముందుండి విద్యార్థులకు న్యాయం చేకూరేలా పోరాటం నిర్వహిస్తుందన్నారు. బాలికల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అధ్యక్షురాలుగా సుఫియా, కార్యదర్శిగా తస్మియా, మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం



గుడిబండ: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కరపత్రాన్ని అందజేస్తున్న ఈరలక్కప్ప



అమరాపురం: హనుమంతనపల్లిలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: ఎన్నికల్లో వందలాది హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు అధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని చిగతుర్పి, కెఎన్‌పల్లిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో గిరిజనులకు పూర్తిగా ఉచిత విద్యుత్ అందిస్తే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. పేదల డబ్బుతో సంపద సృష్టిస్తున్న ఘనత చంద్రబాబునాయుడికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం పాలన ప్రజలకు అందిందన్నారు. కూటమి ప్రభుత్వం అబద్దాలతో కాలం గడుపుతోందని జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ విమర్శించారు. రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడు, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ సర్పంచులు వడ్డెగేరప్ప, అశ్వత్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వైకుంటప్ప, నాయకులు శివలింగప్ప, దాసేగౌడ, చంద్రప్ప, మల్లేష్, ఉడెగేరప్ప, నాగరాజు, నాగభూషణ్, గోవిందప్ప, మల్లికార్జున, రంగనాథ్, అశోక్, మంజునాథ్, రంగధామ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బాబుకు ఓటమి తప్పదు

అమరాపురం: చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి మోసపోయిన ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఆయన్ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ నియోజవకర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర కార్యదర్శి చౌకూరు మధుమతిరెడ్డి, రాష్ట్ర బీసీ.సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, రాష్ట్ర కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, సంయుక్త కార్యదర్శి వాగేష్ పేర్కొన్నారు. గురువారం హనుమంతనపల్లి, కె.శివరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా రైతులకు పైసా కూడా సాయం చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ లాంటి వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. సీఎం చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్‌తో వున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీలు రంజిత్‌కుమార్, క్రిష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు శివకుమార్, శివన్న, సర్పంచులు నరసింహప్ప, ఈరన్న, ఎంపీటీసీలు కెంచప్ప, నారాయణ, నాగరాజు, మంజునాథ సీనియర్ నాయకులు పాండెప్ప, దివాకర్, నాగన్న, చిత్తన్న పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రత పెంచుకోండి

రొళ్ల: బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఆయా శాఖల బ్రాంచ్ మేనేజర్లు భద్రత పెంచుకోవాలని ఎస్‌ఐ వీరాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌తోపాటు ఏటీఎం, కెనరా బ్యాంక్, కర్ణాటక బ్యాంక్ ఏటీఎం వద్ద కూడా సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా అలారమ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కేబుల్ చోరీ..

మడకశిరరూరల్: ఉగ్రేపల్లి గ్రామ సమీపంలో రైతు హరీష్ వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్ వైరును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించికెళ్లారని బాధితుడు గురువారం తెలిపారు. దాదాపు 50 మీటర్ల చోరీ జరిగిందని వాపోయాడు.

'పాలిటెక్నిక్'లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిరరూరల్: గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ఆగస్టు 1 నుంచి 4 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యూ రాధాకృష్ణ గురువారం తెలిపారు. టెన్త్ పాసైన, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 5న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని, విద్యార్థులు టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ,టీసీ తదితర సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఓసీ ,బీసీ రూ.5,800, ఎస్సీ, ఎస్టీ రూ.5,050 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. వివరాల కోసం 9505504206 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బదిలీ అధికారులకు సన్మానం

అగళి: రావుడి పంచాయతీలో పనిచేసి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి రమ్య, ఎంపీఈఓ శివకుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ బసవరాజు, సుజాత గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు పంచాయతీ కార్యదర్శి, ఎంపీఈఓ సేవలను కొనియాడారు. నాయకులు బసవరాజు, రామ్మన్న, వెంకటస్వామి, శివన్న, రమ్మలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలి

హిందూపురం టౌన్: పిల్లలు తినే చాక్లెట్లలో డ్రగ్స్, గంజాయి కలిపి మత్తుకు బానిసలుగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నేడు విద్యార్థులు ఇలా దిగజారి పోవడానికి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్నారు. మద్యం షాపులను వందలాదిగా రాష్ట్రంలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు మద్యానికి బానిసలుగా మరి జీవితాలను పాడు చేసుకుంటున్నారని మండిపడ్డారు.

పౌరహక్కుల దినోత్సవం

సోమందేపల్లి : మండలంలోని పందిపర్తిలో గురువారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. డీఎస్పీ నరసింహప్ప మాట్లాడుతూ గ్రామాల్లో కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. వివాదాలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యాక్రమంలోతహసీల్దార్ మహేష్, సీఐ రాఘవన్, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్‌ఐ రమేష్‌బాబు, న్యాయవాది శివరామ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 బాధ్యతల స్వీకరణ

రొద్దం: నూతన ఎంఈఓ-1గా అరవింద్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీరించారు. ఎంఈఓను యూటీఎఫ్ నాయకులు కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. మండల విద్యాభివృద్ధి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్, ట్రెజరర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1గా హనుమంత రెడ్డి

చిలమత్తూరు: చిలమత్తూరు ఎంఈఓ-1గా హనుమంత రెడ్డి నియమితులయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ-1గా పని చేసిన పద్మప్రియ ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈఓ-1 హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన్ను ఎంఈఓ-2 సాల్మన్‌రాజ్ శాలువాతో సత్కరించారు.

అగళి ఎంఈఓగా కృష్ణమూర్తి రాజు

అగళి: స్థానిక ఎమ్మార్సీలో గురువారం ఎంఈఓగా కృష్ణమూర్తిరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన కదిరి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. నూతన ఎంఈఓను ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

అమరాపురం ఎంఈఓగా సత్యనారాయణ

అమరాపురం: స్థానిక ఎమ్మార్సీలో మండల విద్యాశాఖాధికారి-1గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న ఎంఈఓ-1 రాఘవయ్య పెనుకొండకు బదిలీ అయ్యారు. పెనుకొండ ప్రభుత్వ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎంఈఓ సేవలు మరువలేనివి

పెనుకొండ: ఎంఈఓ చంద్రశేఖర్ సేవలు మరువలేనివని ఉపాధ్యాయులు కొనియాడారు. గురువారం ఆయన పదవీ విరమణ పొందారు. ఉపాధ్యాయులు విశ్రాంత ఎంఈఓను సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, నారాయణస్వామి, నబి, కాడిశెట్టి శ్రీనివాసులు, కోడూరు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీల పేరిట ప్రజలపై భారం

పెనుకొండ: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోందని సీపీఎం, సీఐటీయూ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ సర్కిల్లో కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు హరి మాట్లాడుతూ పాత రీడింగ్ పద్ధతి కొనసాగించాలని, అధిక విద్యుత్ వినియోగం సమయంలో అధిక రేట్లు నిర్ణయించి వసూలు చేయడంతో ప్రజలపై మరింత భారం పడుతోందన్నారు. కరెంట్ బిల్లులు ఆన్‌లైన్లో పంపడం వల్ల జవాబుదారి తనం ఉండదన్నారు. సీపీఎం నాయకులు బాబావలి, గంగాధర, మహబూబ్ బాషా, హబీబ్, వెంకటేసులు, రాజురావు, సూరి, నాగమ్మ, నరసమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

మురుగు నీటితో పంటల నష్టం

పావగడ: పావగడ నుంచి మురుగు నీరంతా సమీపంలోని రొప్పం గ్రామానికి చేరుకుని అక్కడి పచ్చని పంటలన్నీ పాడు చేస్తోందని బాధిత రైతులు గురువారం ఆరోపించారు. రైల్వే బ్రిడ్జ్ క్రింద డక్ ఏర్పాటు చేయకపోవడంతో వరదలా ప్రవహించే మురుగు నీరు పంట పొలాల్లోకి చేరుకుని పంటలను నాశనం చేస్తోందన్నారు. రైల్వే శాఖ కు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పెడ చెవిన పెడుతున్నారని వాపోయారు. డక్ నిర్మించి మురుగు నీటి ప్రవాహానికి అడ్డు కట్ట వేసి ఆదుకోవాలని సంబంధిత అధికారులకు బాధిత రైతులు విన్నవించుకున్నారు.